ప్రజాశక్తి

12న జట్టు ఆశ్రమంలో యువజనోత్సవాలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పట్టణంలోని జట్టు ఆశ్రమంలో ఈనెల 12న యువజన ఉత్సవాలు నిర్వహించనున్నట్టు పార్వతీపురం స్వచ్ఛ సుందర జిల్లా సమన్వయకర్త బి.రామగోపాల్ తెలిపారు. జాతీయ యువజన దినోత్సవం నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పాఠశాలలు కళాశాలల్లో నిర్వహించిన స్వచ్ఛ సుందర పార్వతీపురం అంశాలకు సంబంధించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రదానం చేస్తామన్నారు. అలాగే వివిధ సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

జెడ్‌పి అంచనా బడ్జెట్ రూ.497.96 కోట్లు

- సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎమ్‌పి, మంత్రులు డుమ్మా
- పింఛన్లు రద్దు, అవినీతి పెచ్చుమీరుతోందన్న సభ్యులు
- అధికారులను తప్పబడితే ఊరుకునేది లేదన్న కలెక్టర్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.497.96 కోట్ల జెడ్‌పి అంచనా బడ్జెట్‌ను జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి సవరించిన రూ.496.35 కోట్ల బడ్జెట్‌కు కూడా ఆమోదం తెలిపారు. చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా పరిషత్తు బడ్జెట్ సమావేశం గురువారం జరిగింది. సమావేశానికి అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్‌పిలు, మంత్రులు డుమ్మాకొట్టారు. దీంతో పాలన, కార్యనిర్వహణ తరపున జిల్లాల కలెక్టర్లే సమాధానం చెప్పారు. సమావేశంలో అధికార పార్టీ నుంచి ఒక్క ప్రజాప్రతినిధి లేకపోయినప్పటికీ చర్చ వాడీవేడిగా సాగడం గమనార్హం. ఒకానొక దశలో 'అధికారులను బ్లేమ్ చేస్తే ఊరుకునేది లేదు. ఆరోపణలు చేసే ముందు సభ్యులు ఒకటికి రెండుసార్లు ఆలోచించండి, వేక్‌గా మాట్లాడటం సరికాదు..' అంటూ సభ్యులను కలెక్టర్ హెచ్చరించారు. మరో శాఖపై చర్చ నడుస్తుండగా 'అధికార పార్టీ తరపున కలెక్టర్ గారే మాట్లాడేస్తున్నారు..!' అంటూ పలువురు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఎవరికైనా కలెక్టర్‌గా చెప్పాల్సింది నేనే కదా..! అంటూ ఆయన చలోక్తులతో చురకలంటించారు.

మెటీరియల్ కాంపొనెంట్ పనులు పంచాయతీల తీర్మానం లేకుండా చేస్తున్నారని, చట్టాన్ని సక్రమంగా అమలు చేయడం లేదని, అవినీతి జరుగుతోందని విజయనగరం ఎంపిపి మామిడి అప్పలనాయుడు ఆరోపించారు. అధికారులకు ప్రభుత్వ నిబంధనలు వర్తించవా? అంటూ ప్రశ్నించారు. దీనికి విజయనగరం కలెక్టర్ అంబేద్కర్ స్పందిస్తూ పనుల మంజూరు, చెల్లింపులు నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై అవినీతి ముద్ర వేయడం మంచిది కాదని, ఎక్కడైనా జరిగితే స్పష్టంగా, వివరంగా రాసి ఇస్తే విజిలెన్సు ద్వారా విచారణ చేపడతామని తెలిపారు. సోషల్ ఆడిట్ పూర్తయిన చోట్ల 10 శాతం నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్.. డ్వామా పీడీకి సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

వికలాంగుల పింఛన్లను అనర్హుల పేరుతో తొలగిస్తున్నారనే భయాందోళన ప్రజల్లో ఉందని జిల్లా పరిషత్తు చైర్మన్ అన్నారు. వికలాంగుల పింఛన్లు తొలగించే ఆలోచన ప్రభుత్వానికి లేదని, ఎటువంటి ఉత్తర్వులూ ప్రభుత్వం నుంచి రాలేదని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కేవలం రీవెరిఫికేషన్ మాత్రమే చేస్తున్నామని, ఎటువంటి ఆందోళనా అవసరం లేదని స్పష్టం చేశారు. వెరిఫికేషన్ కోసం ప్రత్యేక వైద్యులతో 6 బృందాలను నియమించామని, రూ.15 వేల పింఛను పొందే వారి ఫొటో తీసి, అక్కడికక్కడే అప్‌లోడ్ చేస్తున్నారని వివరించారు. ఈ దశలో జెడ్‌పి చైర్మన్ స్పందిస్తూ పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని కలెక్టర్‌ను కోరారు.

వైద్య శాఖ సమీక్షలో భాగంగా హెచ్‌ఎంపివి వైరస్‌పై ప్రజలు ఆందోళన చెందుతున్నారని సభ్యులు సమావేశంలో లేవనెత్తారు. రాష్ట్రంలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదని, ఈ వైరస్‌ను ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ తెలిపారు. ఆందోళన అవసరం లేదన్నారు. ఉద్యాన శాఖ సమీక్షలో భాగంగా జిల్లాలో మామిడి అధికంగా సాగులో ఉందని, ఎగుమతులు కూడా జరుగుతున్నాయని, మామిడి పంట ఇన్సూరెన్సు కోసం ఎకరానికి 2 వేల రూపాయలను ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ ప్రీమియం తగ్గించాలని, బీమా గడువును కూడా పొడిగించాలని తీర్మానించి ప్రభుత్వానికి పంపాలని సభ్యులు కోరారు. కలెక్టర్ అంబేద్కర్ స్పందిస్తూ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పరిశీలించి లేఖ రాస్తామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో కూడా జీడి మామిడి పంటకు హెక్టారుకు 4 వేల రూపాయలు ప్రీమియం ఉందని, దానిని తగ్గించాలని లేఖ రాసినట్లు మన్యం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు.

తాటిపూడి బోటు షికారు కోసం అన్ని రకాల అనుమతులు ఉన్నాయా, పర్యాటకుల భద్రతకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు? అని జిల్లా పరిషత్ చైర్మన్.. జలవనరులు, పర్యాటక శాఖల అధికారులను ప్రశ్నించారు. కలెక్టర్ స్పందిస్తూ అన్ని రకాల అనుమతులు ఉన్నాయని, పర్యాటక కార్పొరేషన్, బోటు నడిపే కంపెనీ వారు ఒప్పందం కుదుర్చుకున్నారని చెప్పారు. ఇందులో భద్రత, ధర, ఇతర అంశాలపై చర్చించి బోటు నడపాలా? వద్దా? అనే అంశాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీలు సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు, జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ, రెండు జిల్లాలకు చెందిన అధికారులు, ఎంపిటిసి, జెడ్‌పిటిసి సభ్యులు పాల్గొన్నారు.

జలాశయాలకు మహనీయుల పేర్లు

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

తొలుత జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో జలాశయాల నిర్మాణానికి కృషి చేసిన మహనీయుల పేర్లను పెట్టుకొని భావితరాలకు వారి సేవలను గుర్తుండేలా చేయడం గొప్ప విషయమని అన్నారు. ఆయా జలాశయాల వద్ద వారి విగ్రహాలను కూడా నిర్మించి పార్కులను ఏర్పాటు చేస్తే వారికి సముచితమైన గుర్తింపునిచ్చినట్లు అవుతుందని తెలిపారు. తోటపల్లి ప్రాజెక్టుకు సర్దార్ గౌతు లచ్చన్న పేరును, జంఝావతికి వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు పేరును, మడ్డువలసకు గొర్లె శ్రీరాములు నాయుడు పేరును, తాటిపూడి జలాశయానికి గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరును పెట్టడం జరిగిందన్నారు. ఆయా జలాశయాల వద్ద వారి విగ్రహాలను ఏర్పాటు చేసి, పార్కులను నిర్మించి సుందరంగా తీర్చిదిద్దాలని, నిధులు అవసరమైతే జిల్లా పరిషత్తు నుంచి సమకూరుస్తామని తెలిపారు. ఈ ప్రతిపాదనను సమావేశం తీర్మానించింది.

సమావేశానికి హాజరైన సభ్యులు

వారపు సంతలకు సంక్రాంతి శోభ

వ్యాపారులు, గిరిజనులతో సంతలు కిటకిట జోరుగా సాగిన విక్రయాలు

ప్రజాశక్తి - కురుపాం

పచ్చని పొలాలు... కళ్లాల్లో పండిన పంటలు... తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల ఆప్యాయతా అనురాగాలు.. ఉన్నంతలో కలిసిమెలిసి సాగే జీవనం.. ఒక్కమాటలో చెప్పాలంటే పల్లెలోగిలికి కుటుంబమే ఆభరణం.. ఇదీ మన పల్లె ఖ్యాతి.. కానీ పల్లెల్లో ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. వీధుల్లో తాళం వేసిన ఇళ్లు... చెట్ల కింద వృద్ధుల నిరీక్షణ.. ఏవైనా పండగలు వస్తే తప్ప పల్లెల్లో కళ లేకుండా పోయింది. సొంతూరిని, కన్నవారిని కలుసుకొనేలా 'సంక్రాంతి పండగ తెచ్చింది. పిల్లలంతా బతుకు తెరువుకు పట్టణాలకు పోతే ఇంటి వద్ద నిరీక్షిస్తున్న ముసలి ప్రాణాలకు మళ్లీ వీరి రాకతో గ్రామాల్లో ప్రేమబంధాలు వెల్లివిరుస్తున్నాయి. గ్రామాల్లో చేసేందుకు పనిలేక పొట్టకూటి కోసం ఊరు విడిచి సుదూర ప్రాంతాలకు వలస వెళ్లిన కార్మికులు సంక్రాంతి పండగకు సొంత గూటికి చేరుకుంటున్నారు. వలసలు పోవడంతో నిన్నటి వరకు జనసంచారమే లేక గ్రామాల్లో ఇళ్లకు తాళాలు వేసి బోసి పోయిన గ్రామాలు నేడు జనంతో సందడిగా కనిపిస్తున్నాయి. వలసలతో ఆత్మీయ బంధాలతో పాటు బాల్యం కనుమరుగై పోగా అక్కున చేర్చుకునే అలనా, పాలనా కరువై అష్టకష్టాలుపడుతున్న చిన్నారులకు మరో పది రోజుల పాటు తల్లిదండ్రుల ప్రేమానురాగాలను పొందనున్నారు. సంక్రాంతి పెద్ద పండగ కావడంతో ఉపాధి, ఉద్యోగాలు, వివిధ పనుల్లో ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు స్వగ్రామాలకు తిరిగి వస్తున్నారు. ఆరు నెలలుగా సంపాదించిన సొమ్ముతో ఇళ్లకు సున్నాలు వేసి, కొత్త దుస్తులు కొనుక్కొని సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకోనున్నారు. మండలం కేంద్రంలో బస్సుల నుంచి దిగే కూలీలే గత వారం రోజులుగా కనిపిస్తున్నారు.

కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న కురుపాం సంత

సంతలో సంక్రాంతి శోభ

మండల కేంద్రంలో గురువారం జరిగే వారపు సంతకు సంక్రాంతి శోభ సంతరించుకుంది. వారపు సంతలో కొత్తబట్టలు కొనుగోలుదారులతో బట్టల దుకాణాలు కిటకిటలాడాయి. ఈ వారపు సంత భోగి పండగకు మూడు రోజులు ముందు కావడంతో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన గిరిజనులు క్రయవిక్రయాలు జరిపారు. మన్యం ప్రాంతంలో గిరిజనులు అన్ని అవసరాలకు వారపు సంతపైనే ఆధారపడతారు. మైదాన ప్రాంతానికి వెళ్లి కొనుగోలు చేయాలంటే ఆర్థిక భారం గనుక అందుబాటులో ఉన్న వారపు సంతలను ఆశ్రయిస్తున్నారు. సంక్రాంతి పండగ అంటేనే ఆచార సాంప్రదాయాలతో కూడిన పండగ. గిరిజన రైతులు పండించిన, సేకరించిన వాణిజ్య పంటలైన చిక్కుళ్లు, ఎర్ర కందులు, తెల్లకందులు, పసుపు, పిప్పళ్లు, గుమ్మడి కాయలు, కొండ చీపుర్లు, కరక్కాయలు వంటి అటవీ ఉత్పత్తులను సమకూర్చుకొని సేకరించి ఆదాయాన్ని పండగ అవసరాలు తీర్చుకుంటున్నారు. పండుగకు ఇంటికి ఎవరు వచ్చినా మద్యం ఇస్తారు. అదే గిరిజనుల ఆచారం. సంక్రాంతి పండగ శోభతో వారపు సంతల్లోనూ, గ్రామాలన్ని కళకళలాడుతున్నాయి.

భామిని: స్థానిక ఎఎంసి మార్కెట్ యార్డ్‌లో జరిగిన వారపు సంతలో సంక్రాతి శోభ సంతరించుకుంది. ఏటా సంక్రాతి ముందు వచ్చే వారపు సంతకే ప్రేత్యేక ప్రాధాన్యత ఉంటుంది. గురువారం జరిగిన సంతలో భామిని పరిసర ప్రాంతం గిరిజనులు, గ్రామస్థులు సంక్రాతికి అవసరమైన కొత్త మట్టి కుండలు, కొత్త బెల్లం, కొత్త చింత పండు, బట్టలు, వంట పాత్రలు, కర్ర గరిటెలు, మసాలా దినుసులు కొనుక్కున్నారు. ఏటా సంక్రాతి ముందు వచ్చే గురువారం సంతలో వస్తువులు కొనడం ఆనవాయతీ అని సంతకి వచ్చిన మహిళలు తెలిపారు.

భామిని సంతలో బట్టలు కొనుగోలు చేస్తున్న గిరిజనులు

బిసి, అగ్రవర్ణాల పేదలకు స్వయం ఉపాధి పథకాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని దారిద్ర్య రేఖకు దిగువనున్న వెనుకబడిన తరగతులు, అగ్రవర్ణాల్లోని పేదల అభివృద్ధికి స్వయం ఉపాధి పథకం కింద యూనిట్ల స్థాపన, జెనరిక్ ఫార్మసీల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 21 నుంచి 60 ఏళ్ల వయసు ఉండి, దారిద్ర్యరేఖకు (బీపీఎల్) దిగువనున్న వెనుకబడిన తరగతులు, అగ్రవర్ణాల్లోని పేదలు (ఇడబ్ల్యుసి - కమ్మ, రెడ్డి, ఇబిసి, క్షత్రియ, ఆర్య వైశ్య, బ్రాహ్మణ) అభివృద్ధి కోసం స్వయం ఉపాధి పథకాలు ఏర్పాటుకు, డి-ఫార్మసీ, బి-ఫార్మసీ పూర్తి చేసిన నిరుద్యోగ యువత జెనరిక్ ఫార్మసీల ఏర్పాటుకు సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాలను అర్హత మేరకు కేటాయించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

వెనుకబడిన తరగతుల స్వయం ఉపాధి పథకంలో భాగంగా శ్లాబ్-1, 2, 3 కింద 1221 యూనిట్ల స్థాపనకు లక్ష్యాలు నిర్దేశించినట్లు చెప్పారు. ఇందులో యూనిట్ విలువ రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షలు ఉండగా, 50 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంక్ రుణం ఉంటుందని, గరిష్టంగా రూ.75వేల నుంచి రూ.2లక్షలు సబ్సిడీ లభిస్తుందని అన్నారు. అదేవిధంగా వెనుకబడిన తరగతుల జెనిరిక్ ఫార్మసీల కోసం యూనిట్ విలువ రూ.8 లక్షలు చొప్పున 25 యూనిట్ల ఏర్పాటుకు లక్ష్యం కాగా, అందులో ఒక్కో యూనిట్ ధరలో రూ.4 లక్షలు సబ్సిడీ, రూ.4 లక్షలు బ్యాంకు రుణం ఉంటుందని తెలిపారు.అగ్రవర్ణాల్లోని పేదల స్వయం ఉపాధి పథకాల్లో భాగంగా ఇబిసి 6 యూనిట్లు, బ్రాహ్మణులకు 5 యూనిట్లు, క్షత్రియ ఒక యూనిట్ స్థాపించేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. అలాగే జెనిరిక్ ఫార్మసీలో ఇబిసి, బ్రాహ్మణులు ఒక్కో యూనిట్ చొప్పున రెండు యూనిట్ల ఏర్పాటుకు రూ.16 లక్షలు కేటాయించడం జరిగిందని వివరించారు. అర్హులైన అభ్యర్థులు స్థానిక సచివాలయాల్లో లేదా ఇంటర్నెట్ సెంటరులో అభ్యర్థి రేషన్ కార్డు లేదా రైస్ కార్డు, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 16లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మున్సిపల్ కమీషనర్‌ను పనిదినాల్లో సంప్రదించాల్సిందిగా కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

అంబేద్కర్ విగ్రహాలకు కాంగ్రెస్ నాయకుల వినతులు

ప్రజాశక్తి - సాలూరు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను మాటమాటికీ స్మరించరాదంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు ఆయన క్షమాపణ చెప్పాలని నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త గేదెల రామకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని దత్తివలసలో గురువారం కాంగ్రెస్ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.



సాలూరు : అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కేంద్ర మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సమావేశంలో తీర్మానం చేశారు. మండల పార్టీ అధ్యక్షులు ఒంటి బుచ్చయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంత్రి పదవికి రాజీనామా చేసేంత వరకు దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పిసిసి పిలుపు నిచ్చిందని చెప్పారు. శుక్రవారం పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆధ్వర్యాన విశాఖలో నిర్వహించనున్న ధర్నాకు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని కోరారు. అనంతరం పిఎన్ బొడ్డవలసలో గల అంబేద్కర్ విగ్రహం పాదాల చెంత తీర్మానం కాపీని పెట్టి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ద్వారపురెడ్డి పుండరీకాక్ష నాయుడు, పట్టణ అధ్యక్షులు సిగడాపు బంగారయ్య పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని నర్సిపురంలో పార్వతీపురం నియోజకవర్గ సమన్వయకర్త బత్తిన మోహన్ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షా వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని, మంత్రి పదవి నుంచి అమిత్‌షాను తొలగించాలని కోరారు. ఈ సందర్భంగా నర్సిపురం గ్రామపంచాయతీ సర్పంచ్ బంగారమ్మకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ కార్యకర్తలు, మండల అధ్యక్షులు తేళ్ల గౌరీ శంకర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాయి శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కోలా కిరణ్, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు చింతాడ దిలీప్, మరియు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం : అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

బాలల సంరక్షణ కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లా బాలల సంరక్షణ పర్యవేక్షణ కమిటీ పార్వతీపురం ఐసిడిఎస్ ప్రాజెక్టులో గల ప్రభుత్వ బాల సంరక్షణ కేంద్రాలను గురువారం సందర్శించింది. బాలసదనం, శిశు గృహాలను జిల్లా బాల సంరక్షణ అధికారి పర్యవేక్షణ కమిటీ సందర్శించి పర్యవేక్షణ చేసింది. ఈ పర్యవేక్షణలో భాగంగా ప్రస్తుతం ఆయా బాలల సంరక్షణ కేంద్రాల పనితీరు, రికార్డుల నిర్వహణ అంశాల గురించి నిశితంగా పరిశీలించారు. జిల్లా ప్రొహిబిషన్ ఆఫీసర్ బివి రవికుమార్, బాలల సంరక్షణ నడుపుతున్న ఇన్చార్జులకు కొన్ని సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ భాగంలో బాలలు న్యాయ చట్టం 2015 ప్రకారం రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న కారణంగా నిబంధనలకు అనుగుణంగా ఇక్కడ ఏర్పాట్లు ఉన్నాయో లేదో పరిశీలన కోసం రావడం జరిగిందన్నారు. అలాగే బాలల సంరక్షణ కేంద్రాల్లో ప్రతి గదులను పరిశుభ్రంగా ఉంచుతున్నారో లేదో చూడడం జరిగిందన్నారు. అలాగే ఈ సంరక్షణ కేంద్రంలో మెడికల్ ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయమని చెప్పారు. ఇందులో పనిచేసే సిబ్బందికి పిల్లల పట్ల బాధ్యతగా ఉండాలని తెలిపారు. ఈ కమిటీలో డిస్ట్రిక్ ప్రొహిబిషన్ ఆఫీసర్ బివి రవికుమార్, బి.శ్రీనివాసరావు, చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్, ఎ.సత్యనారాయణ - జిల్లా బాలల సంరక్షణ అధికారి, ఎన్.ప్రసాదరావు - ప్రొటెక్షన్ ఆఫీసర్, పి.శ్రీధర్ - లీగల్ కం ప్రొహిబిషన్ ఆఫీసర్ ఈ పర్యవేక్షణ కమిటీలో పాల్గొన్నారు.

కమిషనర్ విస్తృత పర్యటన

పాలకొండ : సంక్రాంతి పండుగ దగ్గర పడుతుండడంతో పట్టణంలో స్థానిక నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు గురువారం ఉదయం సుడిగాలి పర్యటన చేపట్టారు. పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టారు. వేకువజాము నుంచి పర్యటించి పారిశుధ్య పనులపై దృష్టి పెట్టారు. ముందుగా నగర పంచాయతీ కార్యాలయానికి చేరుకొని కార్మికులతో మాట్లాడి పండగ రోజుల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. ఇందిరానగర్ కాలనీ, వీవర్స్ కాలనీ ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్ రోడ్డుపై చెత్త వేయొద్దని ప్రజలకు సూచించారు.

ప్రభుత్వ వైఫల్యం వల్లే తొక్కిసలాట : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే తిరుపతిలో భక్తుల తొక్కిసలాట జరిగిందని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. గురువారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ తిరుపతిలో ఇలాంటి దుర్ఘటన జరగలేదన్నారు. ఇది ముమ్మాటికీ టిడిపి వైఫల్యమేనని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో యంత్రాంగం విఫలమైందని చెప్పారు. వైకుంఠ ఏకాదశి రోజున దర్శనాలకు డిమాండ్ ఉంటుందని టిటిడి యాజమాన్యానికి తెలియదా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇంతవరకు ఇలాంటి సంఘటనలు జరగలేదని చెప్పారు. టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే ఇలాంటి సంఘటనలు ఎందుకు జరుగుతున్నాయని నిలదీశారు. గతంలో ఇదే ప్రభుత్వ హయాంలో గోదావరి పుష్కరాల సందర్భంగా తొక్కిసలాట జరిగి అనేకమంది మృతి చెందారని చెప్పారు. సిఎం చంద్రబాబు నాయుడు సభల్లోనూ జనం తొక్కిసలాటలో మరణాలు సంభవించాయన్నారు. వైసిపి ప్రభుత్వం హయాం లో ఐదేళ్లలో కూడా తిరుపతిలో ఎలాంటి అపశృతి చోటు చేసుకోలేదని చెప్పారు. తొక్కిసలాటలో ఆరుగురు దుర్మరణం పాలవడం బాధాకరమని, వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని రాజన్నదొర కోరారు.

వీరఘట్టం : కూటమి ప్రభుత్వానికి ప్రచార ఆర్భాటం తప్ప ప్రజల ప్రాణాలంటే లెక్కలేదని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మండిపడ్డారు. గురువారం వీరఘట్టం వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2015లో గోదావరి పుష్కరాల పేరిట ఆర్భాటం చేసి టిడిపి ప్రభుత్వం 29 మంది ప్రాణాలను బలిగొందని, నేడు అదే ప్రచారయాతో తిరుపతిలో ఆరుగురి అమాయకుల ప్రాణాలను తీశారని విమర్శించారు. ఈ ఘటన ప్రమాదవశాత్తూ జరిగినది కాదని, ప్రభుత్వ నిర్లక్ష్యానికి జరిగిన బలవన్మరణాలన్నారు. తిరుపతి చరిత్రలో ఏనాడు జరగని దుర్ఘటన ఇలా జరగడం చాలా బాధాకరమన్నారు. మృతుల్లో ఒక్కో కుటుంబానికి రూ. కోటి పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిరుపతి లడ్డూ విషయంలో ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన డిప్యూటీ సి.ఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఏ దీక్ష చేస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. మీ పాపాలకు, మోసాలకు ప్రజల ప్రాణాలను బలికొంటున్నారని దుయ్యబటట్టారు. బుధవారం విశాఖపట్నం వచ్చిన ప్రధాని మోడీ వద్ద రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశం ఎందుకు ప్రస్తావించలేదని కూటమి నాయకులను విక్రాంత్ ప్రశ్నించారు. ప్రధాని మోడీ పర్యటనతో విశాఖపట్నంకు ఎటువంటి ఉపయోగం కనపడలేదన్నారు. మోదీ పర్యటనలో సుమారు గంటన్నర సేపు జరిగిన ప్రసంగాల్లో కనీసం స్టీల్ ప్లాంట్ ప్రస్తావన తేలేదన్నారు. సి.ఎం, డిప్యూటీ సి.ఎం నోటంట ఉక్కు పరిశ్రమ పరిరక్షణ అంశాన్ని కనీసం ప్రస్తావించలేదన్నారు. ఎంతసేపూ మోడీకి భజన చేయడం తప్ప వేరే అంశం ఈ సభలో కనిపించలేదన్నారు. విలేకరుల సమావేశంలో ఎంపిపి డి.వెంకట రమణనాయుడు. వైసిపి నాయకులు కర్రి లీలాప్రసాదరావు, డి.లలిత కుమారి, బూరాడ చిన్న, భోగి మణి, కెంగువ ఆంజనేయులు, బొత్స ప్రకాష్ రావు, పిన్నింటి శ్రీను ,పిన్నింటి దుర్గారావు, తవుడు, తదితరులు పాల్గొన్నారు.

మెప్మాలో అక్రమాలపై చర్చ

(ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన బడ్జెట్ సమావేశంలో ఇటీవల 'ప్రజాశక్తి'లో మెప్మా సిబ్బంది చేతివాటంపై ప్రచురితమైన వార్తపై చర్చ జరిగింది. నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కౌన్సిలర్లు ఈ అంశంపై తీవ్ర స్థాయిలో చర్చించారు. 12వ వార్డు కౌన్సిలర్ కె.విజయ్‌కుమార్ మెప్మాలో అక్రమాలపై ప్రజాశక్తిలో వచ్చిన వార్తపై ఎందుకు పట్టించుకోవటం లేదని కమిషనర్ సర్వేశ్వరరావును ప్రశ్నించారు. దీనిపై ఐదో వార్డ్ కౌన్సిలర్ వెలమల మన్మధరావు లేచి అధికారులపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పత్రికల్లో వార్త వస్తే దీనిపై సంబంధం లేనట్లు గమ్మున ఉండడం సరి కాదన్నారు. మెప్మా నగర పంచాయతీలో ఉందా, లేదా చెప్పాలని నిలదీశారు. దీనికి కమిషనర్ మెప్మా సిటీ మిషన్ మేనేజర్ కృష్ణారావును పిలిచి మాట్లాడించగా సభ్యులు సంతృప్తి చెందలేదు. వార్త ఖండించలేదంటే తప్పు చేసినట్లే కదా అని సభ్యులు ఆగ్రహం చెందారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని సభ్యులు ముక్తకంఠంగా కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

తమపై రాజకీయ వేధింపులకు పాల్పడుతున్న రాజకీయ నాయకుడితో పాటు అధికారుల నుంచి ఉద్యోగ భద్రత కల్పించాలని పట్టణంలో కొత్తవలసలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులు కొండేటి రాధ, రెడ్డి హేమ, అగ్గాల స్వాతి, బొండపల్లి సుశీలమ్మ, అదే పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్న ఇల్లా జ్యోతి కోరారు. ఈ మేరకు స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి గురువారం వారు సిపిఎం నాయకులు వి.ఇందిర, బంకులు సూరిబాబుతో కలిసి జిల్లా విద్యాశాఖ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలోని కొత్తవలసలో విజయరామరాజు కాలనీ గల మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులుగా గత మూడేళ్ల నుంచి సక్రమంగా విధులు నిర్వహిస్తున్న తమపై ఐదో వార్డు టిడిపి కౌన్సిలర్ భర్త కోలా మధు తమను విధుల నుంచి తప్పించే భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులతో తమను విధుల నుంచి ఆగిపోమ్మని చెబుతున్నారని, మూడేళ్లుగా విధులు నిర్వహిస్తూ జీవనోపాధిని పొందుతున్నామని అన్నారు. అర్ధాంతరంగా మమ్మల్ని ఆగిపోమని చెప్పడం అన్యాయమని, ఈ సమస్యను మీ దృష్టికి తీసుకొస్తున్నట్టు తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

డిఇఒ కార్యాలయ అధికారికి వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

పీసా ఎన్నికల్లో విజయం సాధించిన వారిని అభినందిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఎమ్మెల్యేను కలిసిన పీసా నాయకులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎల్విన్ పేట-1 పంచాయతీకి సంబంధించి పీసా ఎన్నికల్లో గెలుపొందిన ఉపాధ్యక్షులు ఆరిక దేవుళ్ళు, కార్యదర్శి మండంగి మిన్నారావు ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పీసా ఎన్నికల్లో గెలుపొందిన సభ్యులకు ఎమ్మెల్యే సాలువతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పాడి సుదర్శనరావు, నాయకులు మన్మధ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో శుక్రవారం విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేయనున్నట్టు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.గోపా లరావు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబరలో శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి పెంట సత్యనారాయణ గర్భిణులకు అన్నదానం నిర్వహించారు. ప్రతినెలా 9న జరుగుతున్న ఏజెన్సీ ప్రాంతం నుంచి తనిఖీకి వచ్చిన గర్భిణులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నారు. ఈ భోజనానికి గురువారం ఎంఇఒ వితరణ చేశారు.

గుమ్మలక్ష్మీపురం: జియ్యమ్మవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద 60 మంది గర్భిణులకు సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శిఖబడి గ్రామానికి చెందిన సత్యసాయి భక్తులు, ఉపాధ్యాయులు రాయగడ లక్ష్మణరావు ఈ ప్రేమామృత ప్రసాదం అందించడానికి తగు మెటీరియల్ అందించినట్లు సత్యసాయి భజన మండలి కన్వీనర్ కోలక నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పూల బంతి జగదీష్, వైద్య సిబ్బంది, సత్యసాయి యాత్రికలు పాల్గొన్నారు.

సమిష్టిగా పోరాటం చేయాలి

ప్రజాశక్తి - భామిని

రైతు సమస్యలపై ఐక్యంగా పోరాటం చేయాలనీ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ఈశ్వరయ్య అన్నారు. గురువారం భామినిలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఆ సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల రైతులు పాల్గొని తమ ప్రాంతంలో వున్న నీటి వనరులు, నిలిచిపోయిన ఇరిగేషన్, లిఫ్ట్ ప్రాజెక్టులు, ఉపాధి హామీని వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలనీ రైతులు తెలిపారు. మండలంలో పత్తి కొనుగోలు ఏర్పాటు ఐక్య పోరాటాల వల్లే సాధ్యమన్నారు. ఈ సమావేశంలో రైతులు గురిబిల్లి లక్ష్మిపతి, బిడ్డికి ప్రసాద్, గురిబిల్లి ప్రసాద్, కొల్ల చిన్నారావు, వివిధ మండలాల రైతులు పాల్గొన్నారు.

నేడు 18వ విడత సోషల్ ఆడిట్

ప్రజాశక్తి - మక్కువ

2023-24లో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి 18వ విడత సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించనున్నట్లు ఉపాధిహామీ ఎపిఒ ఈశ్వరమ్మ తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలంతా హాజరు కావాలని ఆమె కోరారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలోని చిలకాం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ. మహేష్, సహోపాధ్యాయులు కె. రామ్మోహనరావులు దుప్పట్లు, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను గురువారం అందజేశారు. పాఠశాలలో చదువుతున్న ఆర్థికంగా వెనుకబడివున్న విద్యార్థులను గుర్తించి వారికి ప్రస్తుత సీజన్లో అవసరమైన దుప్పట్లతోపాటు చదువుకు అవసరమైన సామగ్రిని అందజేసినట్లు వారు తెలిపారు. విద్యార్థులకు సామగ్రిని అందజేయడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

కంటి శస్త్ర చికిత్సలకు 103 మంది

ప్రజాశక్తి - సీతంపేట

జై ఆదివాసీ ఎఫ్‌పిఒ సభ్యులు విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి సిఎస్ఆర్ రమాదేవి ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా కుమ్మరిగండి, రోలుగుడ్డి, కడగండి పంచాయితీల్లో సుమారు 400 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 103 మందిని రెండు బస్సుల్లో శస్త్రచికిత్సలకు పంపించారు. కార్యక్రమంలో కుసిమి వైద్యాధికారి శివశంకర్ మాట్లాడుతూ ఎఫిఒలు రైతులను సంఘటనగా ఉంచి వారి ఆరోగ్య సేవా రంగంలో కూడా పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కడగండి సర్పంచ్ చంద్రరావు, అప్పారావు, ఎఫ్‌పిఒ సభ్యులు, సిఇఒ గణేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పత్రికలు వితరణ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో గల నేతాజీ గ్రంథాలయానికి రెండు దిన పత్రికలకు ఏడాది పాటు అవసరమయ్యే రూ.5200 ఆ గ్రామ ఉపాధ్యాయులు వంజరాపు ధర్మారావు, గంట శశికుమార్ అందజేశారు. ఈ మేరకు గురువారం వారు ఆ నగదులను నేతాజీ గ్రంథాలయ స్థాపకులు ఈర్ల సంజీవనాయుడుకు అందజేశారు. ఈ మేరకు ఉపాధ్యాయులిద్దరికి సంజీవనాయుడు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తిరుమరెడ్డి అప్పారావు, సారిపల్లి వెంకటరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిలి, చినబోగిలి, మరిపివలస, సూరంపేట, జోగింపేట, దయానిధిపురం తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లోనూ పారి పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ప్రజలు ఎటువంటి అంటి వ్యాధులు బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వీధిలైట్ల సమస్యలు రాకూడదని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పి.మురళీకష్ణ, పి.తిరుపతిరావు, కె.శ్రీనివాసరావు, రమేష్‌తో పాటు పంచాయతీ సర్పంచులు జొన్నాడ తేరేజమ్మ, తెంటు రామారావు పాల్గొన్నారు.

గిరిజన ఉత్పత్తుల కొనుగోలుపై అవగాహన

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని పనసభద్ర పంచాయతీ మెండంగిలో జిసిసి అటవీ ఉత్పత్తుల కొనుగోలు ధరలపై అవగాహన సదస్సు గురువారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం జిసిసి బ్రాంచ్ డైరక్టర్ నూకమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గిరిజనులకు జిసిసి అందిస్తున్న సేవలపై వారికి అవగాహన కల్పించారు. ఈ ఏడాది చింతపండు కిలో రూ.34 కాగా, కొండచీపుర్ల రేటు రూ.45గా నిర్ణయించామని తెలిపారు. విడివికెల ద్వారా గిరిజన ఉత్పత్తులను స్వయంగా ప్రాసెసింగ్ చేసి అమ్ముకోవచ్చునని వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రాంతానికి చెందిన గిరిజనులు, స్థానిక సేల్స్ మెన్ రామారావు, పాల్గొన్నారు.

జోరుగా రహదారి పనులు

ప్రజాశక్తి - సీతానగరం

రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపిటిసి

మండలంలోని అప్పయ్యపేటలో ఎంపిటిసి సభ్యులు బురిడి కుసుమ సూర్యనారాయణ ఆధ్వర్యంలో సిసి రోడ్లు ముమ్మరంగా సాగుతు న్నాయి. ఎంపిటిసి నిధులతో మెయిన్ సెంట్రల్ రోడ్డు పక్కన సిసి రోడ్లు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎంపిటిసి సూర్యనారాయణ మాట్లాడుతూ తనకొచ్చిన నిధులతో తన సిగ్మెంట్ పరిధిలో గల గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీలు పనులు చేపట్టి ప్రజలకు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని టేంకసింగి, కోసింగిభద్ర మండల పరిషత్ పాఠశాలలు, అంగన్వాడి విద్యార్థులు గురువారం సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కురుపాం నియోజకవర్గ ఇంఛార్జి, ఇరిడి ఎంపిటిసి కద్రక మల్లేశ్వరరావు విద్యార్థులతో కలిసి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. చిన్నారులతో కలిసి సంక్రాంతి వేడుకలు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. సాంప్రదాయ వేసాధారణ దుస్తులతో విద్యార్థులు భోగిమంటలు, గొబ్బెమ్మలు, పిండి వంటలు ఆటపాటలతో గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గజపతి ఝాన్సీ, మహాలక్ష్మి, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

భామిని: స్థానిక ఆదర్శ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముగ్గులు పోటీలు, గాలిపటాలు, పిండి వంటలు ప్రదర్శన, సాంప్రదాయ దుస్తులు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాస్‌రావు, భాస్కర రావు, ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వాన పిల్లి రవి కుమార్, వైస్ ప్రిన్సిపల్ బాబు, వైస్ చైర్మన్ మండల ధనలక్ష్మి పేరెంట్స్ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

భామిని : సంప్రదాయ వస్త్రాల్లో విద్యార్థి

గుమ్మలక్ష్మీపురం : భోగిమంట వేస్తున్న చిన్నారులు

కురుపాం : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ప్రిన్సిపాల్ వి.రామలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల సిబ్బంది విద్యార్థులు మధ్య పండగ సాంప్రదాయ దుస్తులతో భోగి మంటలు, గొబ్బెమ్మలు, సంక్రాంతి ముగ్గులు వేసి సంబరాలు జరిపారు. ఈ సంబరాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని బందలుప్పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు రంగోలి పోటీలు నిర్వహించారు. కోయదొర హరిదాసు వేషాలతో విద్యార్థులు అలరించగా ఆనందోత్సవాల మధ్య భోగి మంటలు వేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక శ్రీ సత్యసాయి డిగ్రీ కళాశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా ప్రారంభించారు. కళాశాలలో విద్యార్థినిలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వేసిన వివిధ రంగుల రంగవల్లికలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపల్ అంపిలి శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అకాడమిక్ అడ్వైజర్ లక్ష్మీనారాయణ, యాజమాన్యం సభ్యులు డి.వెంకటరమణ, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ బి.ప్రకాశరావు, ఎఒ సత్యం, స్కూల్ ఎఒలు కేశవరావు, కృష్ణారావు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. అలానే స్థానిక తమ్మినాయుడు స్కూల్‌లోనూ సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తమ్మినాయుడు విద్యాసంస్థల ప్రెసిడెంట్ శెట్టి నారాయణమ్మ, స్కూల్ ప్రిన్సిపల్ అశోక్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరావు, అధ్యాపక బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

వీరఘట్టం: మండలంలోని దశమంతపురం, నడుకూరు పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఉపాధ్యాయులు పట్టు వస్త్రాలు ధరించారు. భోగి మంటలు, ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

పార్వతీపురం : భోగి మంట వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నిరంతర పర్యవేక్షణ అవసరం

ప్రజాశక్తి - కొమరాడ

గర్భిణులతో మాట్లాడుతున్న ప్రోగ్రాం అధికారి జగన్మోహన్‌రావు

గర్భిణీల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు కెఆర్‌బి పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన పిఎంఎస్ఎంఎ (ప్రధాన్ మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్) కార్యక్రమాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అప్పుడే వైద్య పరీక్షలు పూర్తి చేసుకొని ఫీడర్ అంబులెన్స్ వాహనంలో ఇంటికి బయల్దేరుతున్న గర్భిణీతో మాట్లాడి ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. మారుమూల మసిమండ గ్రామానికి చేర్చుతున్నామని వాహన సిబ్బంది తెలిపారు. అనంతరం పిహెచ్‌సిలో గర్భిణీలకు వైద్యాధికారి, సిబ్బంది చేపడుతున్న ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల వివరాలు మాతా, శిశు సంరక్షణ కార్డుల్లో పరిశీలించారు. గత నెల నివేదికలు, ఆరోగ్య స్థితి వివరాలతో సరి చూశారు. ల్యాబ్ వద్ద పరీక్షలు చేస్తున్న తీరును గమనించారు. రక్తహీనత గుర్తించిన గర్భిణీల్లో నెలనెలా హీమోగ్లోబిన్ శాతం వృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలని, ఎనీమియా ఏక్షన్ కమిటీలు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రసవ సమయం నాటికి రక్తహీనత ఉండరాదని, అంగన్వాడీ, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి గర్భిణుల పోషకాహారం, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు సక్రమంగా తీసుకుంటున్నారా లేదా అని క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. గర్భిణీల్లో జ్వర లక్షణాలను గుర్తిస్తే హైరిస్క్‌గా పరిగణించి తక్షణమే పరీక్షలు జరపాలన్నారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్య తనిఖీలు, పరీక్షలు కోసం ప్రతి నెలా ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పిఎంఎస్ఎంఎ కార్యక్రమాన్ని ముందస్తు ప్రణాళికతో చేపట్టాలన్నారు. ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాల గర్భిణిల ఆరోగ్య విషయమై మరింత శ్రద్ధ కనబర్చాలని సూచించారు. పిహెచ్‌సిలో ప్రసవాలపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా పిఎంఎస్ఎంలో గర్భిణీలకు అక్కడ పోషకాహారం అందజేసిన సత్యసాయి ట్రస్టు సేవను కొనియాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ టి.గణేష్‌పట్నాయక్, ఆరోగ్య శాఖ డెమో యోగీశ్వరరెడ్డి, ఎస్‌యుఒ ధనుంజయరావు, సూపర్వైజర్లు శోభ, శారద, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

జీడి ప్రాసెసింగ్‌తో రైతులకు అధిక లాభాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జీడీ ప్రాసెసింగ్ ద్వారా గిరిజనులకు అధిక లాభాలు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సబ్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు.గురువారం స్థానిక ఐటీడీఎ కార్యాలయంలో వెలుగు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని వన్ ధన్ వికాస్ కేంద్రాలను వాడుకలోకి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు. జీడీ పంటను అభివృద్ధి పర్చాలన్నారు. నాణ్యమైన జీడీని సేకరించడం ద్వారా అధిక ధర లభిస్తుందని తెలిపారు. రైతుల ద్వారా సేకరించిన జీడీని గుమ్మ క్ష్మీపురం, సాలూరుల్లో స్థాపించబోయే ప్రాసెసింగ్ సెంటర్ లో ధరను నిర్ణయించి జీడీ రైతులకు అధిక లాభాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని వెలుగు సిబ్బందికి సూచించారు. విడివికెలో క్యాలెండర్ తయారు చేసి సంవత్సరం మొత్తం పని జరిగేలా యాక్షన్ ప్లాన్‌తో సిద్ధంగా ఉండాలని వెలుగు సిబ్బందిని ప్రాజెక్ట్ అధికారి వారు ఆదేశించారు. ఈ సమావేశంలో వెలుగు డిపిఎం అప్పారావు, ఎపిఒ మురళీధర్, 8 మండలాల ఎపిఎంలు పాల్గొన్నారు.

ఫైనల్‌కు వీరఘట్టం జట్టు

పాలకొండ: పాలకొండ క్రికెట్‌లీగ్‌లో భాగంగా గురువారం జరిగిన క్వాలిఫైర్ వన్ మ్యాచ్లో భాగంగా వీరఘట్టం జట్టు పాలకొండ ఎ- జట్టుపై గెలిచి ఫైనల్ చేరుకుంది. ఈ మ్యాచ్‌లో అనీష్ 8 ఫోర్లు 7 సిక్సర్లు సహాయంతో 47 బంతుల్లో 80 పరుగులు చేశారు. అలాగే బౌలింగ్లో ఒక వికెట్ కూడా తీసి ఈ మ్యాచ్‌లో మాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ టోర్నీలో భాగంగా శుక్రవారం పాలకొండ-బి, సీతంపేట జట్లు తలపడనున్నాయని నిర్వాహకులు ముఖేష్, సందీప్, శివ తదితరులు పేర్కొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

సీతంపేట : నియోజకవర్గంలోని పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని మండల జనసేన అధ్యక్షులు మండంగి విశ్వనాధం పిలుపునిచ్చారు. మండలంలోని హడ్డుబంగిలో పాలకొండ నియోజకవర్గ ఆత్మీయ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా విశ్వనాధం మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల గురించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కుండంగి శ్రీకాంత్, నిమ్మక ఉపేంద్ర, నిమ్మక కోటి, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గోతులను పూడ్చిన ఎస్ఐ

ప్రజాశక్తి - కొమరాడ

గోతులను దగ్గరుండి పూడ్చివేయిస్తున్న ఎస్ఐ నీలకంఠం

పండగకు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రజలతోపాటు వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా తాత్కాలికంగా రోడ్డుపై ఉన్న గోతులను కప్పుతున్నట్లు స్థానిక ఎస్ఐ కె. నీలకంఠం అన్నారు. గురువారం అంతర్రాష్ట్ర రహదారి చోళ్ళపదం శివాలయం వద్ద ఏర్పడిన భారీ గోతులను ఆయన ఆధ్వర్యంలో జెసిబితో కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తాత్కాలికంగా రోడ్డుపై ఏర్పడిన గోతులను కప్పుతున్నామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న వారితోపాటు నిత్యం ప్రయాణాలు చేస్తున్న వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల బారిన ప్రజలు పడకుండా రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు ప్రయాణించడం వల్ల అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. పండగ సమయాల్లో ముఖ్యంగా యువత మద్యం సేవించి రేస్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సైన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫెయిర్‌కు స్పందన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సైన్స్ ఫెయిర్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

జియమ్మ వలస మండలం లోని చిన మేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సవరపు రవణ పర్యవేక్షణలో నిర్వహించిన సైన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫెయిర్ 2025కు ఉన్నత పాఠశాల విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. చిన మేరంగి, బీజేపురం హైస్కూల్ నుంచి 9,10 తరగతుల విద్యార్థులు వచ్చి దీనిని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ల్యాబ్ సైన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫెయిర్ మెథడ్స్ పై కళాశాలలో ఉన్న అన్ని గ్రూప్ సబ్జెక్టులపై కళాశాల విద్యార్థులకు ఉన్న ప్రతిభను, విద్యాబోధన పరిస్థితిని హై స్కూల్ విద్యార్థులకు పూర్తిగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. దీని ద్వారా రానున్న విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పెంచి వారి భవిష్యత్తుకు బాధ్యత తీసుకోవడానికి చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-2 ముదిలి శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగిన పల్లె వెలుగు బస్సు

ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

ప్రజాశక్తి - కురుపాం

బస్సును ముందుకు తోస్తున్న ప్రయాణికులు

మండల కేంద్రంలో గురువారం బీరుపాడు గ్రామానికి వెళ్లే పల్లె వెలుగు ఆర్‌టిసి బస్సు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో మరమ్మత్తులకు గురై ఆగి పోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతి గురువారం జరిగే వారపు సంతకు కురుపాం నుంచి బీరుపాడు తిరిగే బస్సు ఈ గురువారం బీరుపాడు చుట్టుపక్కల గిరిజన గ్రామాల ప్రజలు సంతకు వచ్చి వారు కొనుక్కున్న సామాన్లతో తిరిగి ఇంటికి వెళ్తున్న నేపథ్యంలో బస్సు ఎంతసేపు నెట్టినప్పటికీ స్టార్ట్ కాలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో గిరిజన ప్రజలు ఆటోలు, లగేజ్ వ్యాన్లను ఆశ్రయించారు.

అంతర పంటలతో అధిక ఆదాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విత్తనాలను చూపిస్తున్న వ్యవసాయాధికారులు

జియమ్మ వలస మండలం చింతలబెలగాంలో పెద్దింటి కృష్ణ అరటిలో అంతర పంటలుగా జొన్న, సజ్జ, ఆముదం, కంది, బీర, బెండ, గోంగూర, మెంతికూర, తోటకూర, చిక్కుడు, రాగి ఇలా 12రకాలు పంటలు సాగు చేస్తున్నారు. దీనివల్ల అన్ని రకాల పోషకాలు కలిగిన ఆహార పదార్థాలు కుటుంబ అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు అదనపు ఆదాయం పొందవచ్చని వ్యవసాయ అసోషియట్ జి.అన్నపూర్ణ తెలిపారు. రైతులంతా ఇలా అంతర్ పంటలు పండించడం ద్వారా నిత్య పంటలు, ఆదాయం లభిస్తుందని అన్నారు. అంతర్ పంటలు వేయటం వల్ల మొక్కల్లో జీవవైవిద్యం చెందడం వల్ల ప్రధాన పంట అరటి గెలలు పెద్ద సైజులో వచ్చాయని తెలిపారు. చినమేరంగి పాఠశాల ప్రాంగణంలో కూడా పలు పంటలో లభించే విత్తనాల సేకరణ చేయడం, ఎటిఎం పంటల్లో కూడా విత్తనాలు సేకరించుకుని ఖరీఫ్‌లో నవధాన్యాలు విత్తనాలుగా వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు గౌరమ్మ, కృష్ణ, మండల ఇన్‌ఛార్జ్ బి.ధనుంజయరావు, ఎం.సింహాచలం, రవి తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతి

దోనుబాయి పిహెచ్‌సి సందర్శన

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలో ధోను భాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.విజయపార్వతి గురువారం సందర్శించారు. రోగుల పరిస్థితి గురించి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. మందులు అన్ని అందుబాటులో ఉంచాలన్నారు. రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో రోగాలపై ఎప్పటికప్పుడు తెలుసుకొని సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లపై ఏ విధంగా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్ పరీక్షలు గదినీ పర్యవేక్షించారు. ఆమె వెంట వైద్యాధికారి భాను ప్రతాప్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థులకు గురువారం సెట్విజ్ సహకారంతో ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్, డ్రగ్స్, మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండి, మొబైల్ ఫోన్ల ద్వారా కేవలం విద్య విజ్ఞానం మాత్రమే ఉపయోగించాలని, అనవసరమైన ఆన్లైన్ గేమ్స్ ఆడకుండా వ్యక్తిగత ఆరోగ్యం, పరిశుభ్రత, ఏకాగ్రత వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని, తద్వారా ఉత్తమ పౌరులుగా గుర్తింపు పొందుతారని అన్నారు. అలాగే కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా ముఖ్యమని సూచించారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.సత్యనారాయణ, స్థానిక పోలీసులు అసిరయ్య, లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేస్తున్న షేక్ గౌస్

కిట్లను పంపిణీ చేస్తున్న చైర్మన్, కమిషనర్

సిబ్బందికి రక్షణ కిట్లు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలోని శానిటేషన్ సిబ్బందికి సేఫ్టీ కిట్లను నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాపరావు, కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు గురువారం అందజేశారు. పట్టణంలోని సెప్టిక్ ట్యాంక్ క్లినింగ్ కోసం వెళ్లే ఎంపిక చేసిన సిబ్బందికి ప్రభుత్వం నుంచి వచ్చిన గ్లౌజ్‌లు, మాస్కులు, షూ తదితర సామగ్రిని వారికి అందజేశారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు గంటా సంతోష్, కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, కిల్లారి మోహనరావు, కడగల వెంకటరమణ, తూముల లక్ష్మణ, పడాల రాంబాబు తదితరులు ఉన్నారు.

మాజీ జెడ్‌పిటిసికి రాజన్నదొర పరామర్శ

ప్రజాశక్తి - సాలూరు

మాజీ జెడ్పీటీసీ సభ్యులు రెడ్డి తిరుపతినాయుడును గురువారం మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడు తున్న తిరుపతి నాయుడ్ని బాగువలసలో ఆయన నివాసానికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తిరుపతి నాయుడు వృద్ధాప్యం రీత్యా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన వెంట వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, మాజీ సర్పంచ్ భాస్కరరావు వున్నారు.

సోషల్ ఆడిట్ బృందం తనిఖీ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధిలోని కస్తూరిబా, ఆదర్శ పాఠశాలలో సామాజిక తనిఖీ బృందం గురువారం పర్యటించి తనిఖీ చేసింది. పాఠశాలలోని రికార్డులను బృంద సభ్యులు తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖి చర్చించి సమస్యలను తెలుసుకున్నారు. మధ్యాహ్న బోజనాల్లో నాణ్యతను తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న అన్ని ల్యాబ్‌లు తనిఖీ చేశారు. పాఠశాల వసతి గృహం తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు.